# పెద్దచెవుల సుబ్బూ!

జి. ఆర్. మహర్షి

సుబ్బూ ఒక జ్ఞాని. ఈ విషయం మొదటిసారి అతని చెవుల్నిచూసి గ్రహించాను. ఒక మనిషి చెవుల్ని బట్టి అతని తెలివితేటల్ని అంచనా వేసే విద్యను మా నాయనమ్మ నేర్పింది. దేవుడు ఏదీ వూరికే ఇవ్వడు. పెద్ద చెవుల్ని ఇచ్చాడంటే, అంతేస్థాయిలో తెలివితేటల్ని కూడా ఇస్తాడని ఆమె చెప్పేది.

చెవికి మెదడుకి దగ్గర సంబంధముంది కాబట్టి సైంటిఫిక్‌గా కూడా ఇదే కరెక్టే కావచ్చు. పెద్దవాళ్ళు వూరికే ఏదీ చెప్పరు. ప్రతి పనికి ఒక కారణం, ఒక ఫలితం వుంటాయని నమ్మేవాళ్ళలో నేనొకణ్ణి.



సుబ్బూ వయసు ముప్పయి. ఒంటిమీద పావుసేరు కండ లేకుండా ఇనుపచువ్వలా వుంటాడు. పెళ్ళికాలేదు కాబట్టి ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు. నేనో యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌ని. బిజినెస్ మేనేజ్‌మెంట్ టీచ్ చేస్తాను. యూనివర్శిటీ విద్యార్థులు చాలా బుద్ధిమంతులు. ఒకరోజు నేను పొరపాటున హిస్టరీ స్టూడెంట్స్ క్లాస్‌కెళ్ళి బిజినెస్ గురించి టీచ్ చేస్తే వినడమే గాకుండా డౌట్స్ కూడా అడిగారు!

ఈ సుబ్బూ అసలు నాకెలా పరిచయమయ్యాడంటే ఒక రోజు యూనివర్శిటీ నుంచి ఆటోలో వస్తూ వుంటే మాంచి మిరపకాయ బజ్జీల వాసన తగిలింది. ఆటోదిగి కుక్కలా వాసనపడుతూ వెళితే ఒక బండిపై సుబ్బూ బజ్జీలు వేస్తున్నాడు. ఏనుగులాంటి పెద్ద చెవులతో వున్న అతన్ని చూడగానే నాకు గౌరవం పెరిగింది. వెళ్ళి పరిచయం చేసుకున్నాను. అతనొక జ్ఞాని అనే విషయం మొదటి దెబ్బలోనే అర్థమైంది.

బతకడానికి బజ్జీలమ్ముతున్న సుబ్బూ అసలు పేరు సుబ్రమణ్యం. చిన్నప్పటినుంచి అతనికి గొప్పవాడు కావాలని కోరిక. దీనికోసం వూళ్ళో వున్న నాలుగెకరాలు అమ్మాడు. సినిమా తీయడానికి హైదరాబాద్ వచ్చాడు. ఒక తలమాసినోడు తగిలి కథా చర్చలకే

డబ్బంతా తినేసాడు. దివాళాతీసిన సుబ్బూ పబ్లిక్ గార్డెన్స్‌లో కుళాయినీళ్ళు తాగి బతికి హుసేన్‌సాగర్‌లో దూకి చావాలనుకున్నాడు. సినిమా నిర్మాతలు తప్ప ఎవడుబడితే వాడు సాగర్‌లో దూకడానికి వీల్లేదని హెచ్చరిస్తూ లేక్ పోలీసులు నాలుగు వుతికారు. చావుకంటే కూడా పోలీస్ దెబ్బలు ప్రమాదకరమైనవని తెలుసుకున్న సుబ్బూ అక్కన్నుంచి పారిపోయి అన్నపూర్ణా స్టూడియో గేట్ దగ్గర తేలాడు.

ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెదుక్కోవాలనే సిద్ధాంతాన్ని నమ్మిన వాడై స్టూడియో దగ్గరే తచ్చాడుతూ వుంటే, అక్కడున్న సెక్యూరిటీ గార్డుకి ఇది నచ్చక మెడబట్టి తోశాడు. అవమానం సహించలేని సుబ్బూ "కష్టపడి డబ్బు సంపాదించి, ఇదే స్టూడియోలో సినిమా తీస్తా ధర్తీ మాకీ కసమ్" అని ప్రతిజ్ఞ చేస్తుండగా, సెక్యూరిటీ గార్డు ఈసారి తోయడమే గాకుండా తన్నాడు కూడా.

దారినపోయే ఒక పెద్దమనిషి ఇది చూసి సుబ్బూని లేవనెత్తి "ఏ పని చేయాలన్నా చేతిలో విద్య వుండాలి" అని ఉపదేశించి ఇంటికి తీసుకెళ్ళి సుబ్బూకి వంట నేర్పాడు. ఆయన చేతి చలువతో సుబ్బూ ఒక బజ్జీల బండి పెట్టుకుని బతుకునీడుస్తున్నాడు.

ఈ సినిమా కథ విని నేను కరిగి నీరైపోయాను. మంచివాళ్ళకి ఎప్పటికైనా మంచిరోజులొస్తాయని ఓదార్చాను. ఫ్లాష్‌బ్యాక్ నుంచి తేరుకున్న సుబ్బూ తాను ఎన్ని రకాలుగా బజ్జీలను వేపగలడో వివరించాడు. ఇద్దరం ఫ్రెండ్సయిపోయాం.

సుబ్బూ అప్పుడప్పుడు యూనివర్శిటీకి నాతో పాటు వచ్చేవాడు. జ్ఞానానికి, యూనివర్శిటీలకు ఏమీ సంబంధం లేదని ఒకథియరీ పాస్ చేసాడు. నేను ఖండించాలనుకున్నాను కానీ మా నాయనమ్మ మాటలు గుర్తొచ్చాయి. 'ఏనుగు చెవుల వాళ్ళకి బోలెడు తెలివి, జాగ్రత్త' అనేది.

ఒకరోజు తనకో డాక్టరేట్ ఇప్పించమని అడిగాడు సుబ్బూ. ఇంకా బజ్జీలకి డాక్టరేట్లు అమ్మే రోజులు రాలేదని అన్నాను. దాంతో కోపమొచ్చి మట్టిని చేతిలోకి తీసుకుని "ఎప్పటికైనా బజ్జీలు-బహువ్రీహి సమాసం ఒక తులనాత్మక పరిశీలన' అనే అంశంపై డాక్టరేట్ సాధిస్తాను" అంటూ ప్రతిజ్ఞ చేసాడు.

"వరుసగా ప్రతిజ్ఞలు చేస్తూపోతే, అవి నెరవేర్చేదెప్పుడు?" అని అడిగాను.

"సెకండ్ హాఫ్‌లో" అని సమాధానమిచ్చాడు.

పేరుకి నేను బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుకున్నాననే మాటేకానీ, నాకు కూరగాయలు బేరమాడ్డం కూడా రాదు. సుబ్బూ బుర్రలో అనేక బిజినెస్ ఐడియాలున్నాయి. అతను కోటీశ్వరుడు కాకపోడానికి కేవలం పెట్టుబడి లేకపోవడమే కారణమని చెప్పాడు. బిజినెస్ చేయాలని నాక్కూడా కోరికుంది కానీ, సరైన పార్టనర్ లేక వూరుకున్నాను. ఇంత కాలానికి వెదకబోయిన తీగ దొరికింది.

"మనకు తెలివుండాలేగానీ రాతిని పట్టుకున్నా బంగారమవుతుంది ప్రొఫెసర్" అన్నాడు సుబ్బూ.

"బంగారాన్ని పట్టుకుంటే?" అన్నాను.

దానికేం మాట్లాడలేదుగానీ ఒక కొత్త ఐడియా చెప్పాడు. మా బిజినెస్ పుస్తకాల్లో ఇలాంటివి వుండవు.

"ఇప్పుడంతా కార్పొరేట్ ప్రపంచం ప్రొఫెసర్. సాంప్రదాయక పద్ధతులతో జనం బాగా విసిగిపోయారు. ప్రతిదాన్ని మనం కొత్తగా అమ్మాలి, బజ్జీలనైనా సరే" అన్నాడు సుబ్బూ.

"బజ్జీలను కొత్తగా అమ్మడమెలా? నూనెకి బదులు నెయ్యిలో వేగిస్తావా?" అని అడిగాను.

"కొలెస్ట్రాల్ పెరిగి జనం చస్తారు. బిజినెస్‌తో పాటు ప్రజల ఆరోగ్యం కూడా మనకు ముఖ్యం. మనమేది అమ్మినా కొనడానికి జనం బతికుండాలిగా" అన్నాడు.

"మరి కొత్తగా అంటే ఎలా?" అని అడిగాను.

"ఇంతకాలం చక్రాల బళ్ళపై బజ్జీలనే జనం రుచి చూశారు. ఇప్పుడు మారుతి వ్యాన్‌లో మొబైల్ దుకాణాన్ని చూస్తారు"

"మన దగ్గర మారుతి వ్యాన్ లేదుగా?"

"మీరు కొంటారుగా"

నన్ను పార్టనర్‌గా చేర్చుకుంటున్నందుకు సుబ్బూకి థాంక్స్ చెప్పాను.

ఇద్దరం కలిసి పాత మారుతి వ్యాన్‌ని బేరం చేశాం. ఒకడు పాతిక వేలకే ఇస్తానన్నాడు. నేను ముప్పయ్ వేలకు అడిగాను. సుబ్బూ నా చేతిని గిల్లి ఇరవై అయిదు వేలకు సెటిల్ చేసాడు. దాని రిపేరుకి యాభైవేలు వదిలింది. ఎలాగైతేనేం బండి పట్టాలెక్కింది. యూనివర్శిటీ గేట్ ఎదురుగా వ్యాన్‌ని ఆపి బిజినెస్ చేద్దామని అన్నాడు సుబ్బూ. అయితే ఆ వ్యాన్‌కి ఒక డ్రైవర్ కావాలనే విషయాన్ని ఇద్దరం మరచిపోయాం. డ్రైవర్‌కోసం వెతుకుతూంటే అప్పలరాజు అనేవ్యక్తి తగిలాడు. ఇండియాలో తాను బెస్ట్‌డ్రైవర్‌నని చెప్పాడు. నమ్మి వ్యాన్ తాళాలిచ్చాం.

బండి స్టార్ట్ చేసి గేర్ వేయడం ఎలాగని అడిగాడు ఆ బెస్ట్ డ్రైవర్.

మూడు రోజులు వాడిని డ్రైవింగ్ క్లాస్‌లకి పంపాం. తరువాత బిజినెస్ మొదలైంది.

సుబ్బూ ఇంటినుంచి బయలుదేరి యూనివర్శిటీ గేట్ ముందు వ్యాన్‌ని ఆపి చక్రాల కింద రెండు బండరాళ్ళు పెడతాడు అప్పలరాజు. 'నమో వెంకటేశా' అనే పాటతో సుబ్బూ బిజినెస్ స్టార్ట్ చేస్తాడు. ముందుగా వ్యాన్ వెనుక డోర్ ఎత్తేసి తన సరంజామా సర్దుకుంటాడు. వ్యాన్‌లోసీట్లు ఇలాంటివేం వుండవు.


సుబ్బూ రకరకాల బజ్జీలు వేసి అమ్ముతూ వుంటే డబ్బులు తీసుకోవడం నా పని. యూనివర్శిటీలో ఎలాగూ మూడొందల ముప్పయ్ రోజులు పనుండదు కాబట్టి ఏ బిజినెస్‌కీ నా ఉద్యోగం అడ్డంకి కాదు.

మొదటిరోజు వ్యాపారం బాగా జరిగింది. కాని కలెక్షన్ కనబడలేదు. లెక్కల్లో నేను కొంచెం పూర్ అని సుబ్బూకి అనుమానమొచ్చింది. రెండోరోజు అది ధృవీకరించబడింది. మూడోరోజుకి అన్నీ తానే చూసుకుంటానని చెప్పాడు.

"ప్రొఫెసర్! మీరు కేవలం నా బిజినెస్‌ని పరిశీలిస్తూ వుండండి చాలు. ఈ అనుభవం మీకు టీచింగ్ మెథడాలజీలో పనికొస్తుంది" అన్నాడు.

చెవుల్ని బట్టి మనిషిని అంచనా వేయగలను కాబట్టి, సుబ్బూ మాటలు నేను వినాల్సి వచ్చింది.

బజ్జీల వ్యాన్ ముందు నేను నిలబడి వుండడాన్ని కొంతమంది స్టూడెంట్స్ గమనించి నామీదున్న గౌరవం కొద్దీ బజ్జీలు కొన్నారు. ఒకరిద్దరు నా



కొలీగ్స్ ''ప్రొఫెసర్, ఆరోగ్యం బాగాలేదా?'' అని అడిగారు. అజ్ఞానంలోంచి ఇలాంటి ప్రశ్నలు పుడతాయని నాకు తెలుసు.

ఒక ప్రొఫెసర్ మాత్రం బజ్జీల రుచికి మురిసిపోయి, ఎలాగైనా సరే 'సెనగ పిండి' దాని బహుముఖతత్వం' అనే అంశంపై తన స్టూడెంట్స్‌తో థీసిస్ రాయిస్తానన్నాడు.

సుబ్బా సంతోషించి ధన్యవాదాలు తెలుపుతూ తప్పకుండా ఆ థీసిస్‌పై తన అభిప్రాయం చెబుతానన్నాడు.

ఆ ప్రొఫెసర్‌కి కోపమొచ్చి ''బోడి బజ్జీలమ్ముకునే వాడివి నువ్వేంటి నా థీసిస్‌పై అభిప్రాయం చెప్పేది?'' అని ఎగతాళి చేసాడు.

సుబ్బా మారు మాటాడకుండా తన దగ్గరకి తూకానికొచ్చిన థీసిస్‌లను చూపించాడు.

''థీసిస్‌లో రెండు రకాలు, ఒకటి చదవడానికి పనికొచ్చేవి, రెండు బజ్జీలు కట్టడానికి పనికొచ్చేవి'' అంటూ తత్వాన్ని విడమరిచి చెప్పాడు సుబ్బా.

నేను మొబైల్ బజ్జీల కొట్టు పెట్టానని ఎవరో మా ఆవిడ చెవిలో వూదారు. ఆమె వెంటనే నా బ్యాంక్ పాస్ బుక్ చెక్ చేసి అందులోంచి ఎనభై వేలు తగ్గిందని పసిగట్టింది.

''యూనివర్శిటీలో ఉద్యోగం చేస్తూ బజ్జీల కొట్టు పెట్టావంటే, నీకు మతుందా లేదా?'' అని నిలదీసింది.

''పెళ్ళికి ముందు మతుండేది, ఇప్పుడు లేదని నీకూ తెలుసు. బైదిబై నేను పెట్టింది బజ్జీల కొట్టు కాదు, బజ్జీల వ్యాన్'' అని సరిదిద్దాను.

''వ్యానో, విమానమో నాకనవసరం. అకౌంట్‌లోంచి ఎనభైవేలు ఎందుకు తగ్గిందో చెప్పు?'' అని అరిచింది. అరవడం, కరవడం తప్ప ఆమెకి మామూలుగా మాట్లాడ్డం తెలియదు.

''సూక్ష్మంలోనే మోక్షముంటుంది. ఏదైనా సరే చిన్నదే, రాన్రానూ పెద్దదవుతుంది. ప్రతి పనికీ ఒక కారణం, ఒక ఫలితం వుంటాయి'' అన్నాను.

అర్థం కానట్టు మొహం పెట్టి ''ఎనభై వేలు ఏమైనాయి?'' అని సీరియస్‌గా అడిగింది.

డబ్బెక్కడికి పోలేదని మారుతి వ్యాన్ గురించి చెప్పాను.

''అయితే ఆ వ్యాన్‌ని ఇంటికి తీసుకురండి. అందులో మార్కెట్‌కి వెళితే ప్రిస్టేజిగా వుంటుంది'' అంది.

''ఆ వ్యాన్‌లో సీట్లుండవు'' అని చెప్పాను.

సీట్లులేని వ్యాన్‌లుంటాయనే విషయం ఆమెకప్పటివరకూ తెలియదు.

మరుసటి రోజు అసలు విషయం తెలుసుకుందామని ఆమె యూనివర్శిటీ గేట్ దగ్గర కాపలా కాసింది. దీన్ని ముందే పసిగట్టి వ్యాన్‌ని దారి మళ్ళించి యూనివర్శిటీ లైబ్రరీ దగ్గర ఆపాం. లైబ్రేరియన్ మా రెగ్యులర్ కస్టమర్. రిఫరెన్స్‌కోసం లైబ్రరీలో వుంచిన థీసిస్‌లను వేసి బార్టర్ సిస్టంపై బజ్జీలు తీసుకుంటూ వుంటాడు.

ఒకటి రెండ్రోజులు మా ఆవిడ కాపుకాసి తరువాత విసుగేసి మానేసింది. బ్యాంక్ బ్యాలన్స్ మొత్తం నాతో డ్రా చేయించి తన దగ్గర పెట్టుకుంది.

మా బిజినెస్ వూపందుకుంటూ వుండగా అప్పలరాజు బ్రేక్ వేశాడు. తాను చాలా డిసిప్లిన్డ్ మనిషినని టైం ప్రకారం వస్తానని, వెళతానని ప్రకటించాడు.

ఆరుగంటలకి మా మొబైల్ వ్యాన్‌ని స్పాట్‌లో ఆపి, సరిగ్గా రాత్రి 9 గంటలకు స్టార్ట్ చేసేవాడు. ఒకరోజు వేడి వేడి నూనెలో బజ్జీలు వేగుతూవుండగా టైం ప్రకారం అప్పలరాజు వచ్చి బండిని కదిలించాడు. సుబ్బా ఒంటిపై నూనెపడి బొబ్బలెక్కింది. వ్యాన్‌లోంచి దూకేశాడు. దెబ్బలేం తగల్లేదు. ఎందుకంటే ఏ వాహనాన్నయినా రోడ్డురోలర్‌లాగే నడపడం అప్పలరాజు ప్రత్యేకత.

ఆస్పత్రికి తీసుకెళుతూంటే పెడబొబ్బలు పెట్టాడు సుబ్బా. నర్స్ ఇంజక్షన్ చేస్తూ వుండగా ఏదో జ్ఞానోదయమైనట్టు మొహం పెట్టాడు.

''బజ్జీల వల్ల ఇన్ని ప్రమాదాలున్నాయని తెలీదు బాస్. నేను ఫీల్డ్ మార్చుకుంటున్నాను''

''మరి మారుతీ వ్యాన్''అన్నాను.

''మార్ దో గోలీ'' అన్నాడు.

ఇద్దరం కలిసి అతికష్టంపై దాన్ని ఇరవై వేలకు అమ్మాం. అందులో నష్టపరిహారంగా ఐదువేలు అప్పలరాజు తీసుకున్నాడు. పదిహేను వేలు తీసుకెళ్ళి వారం రోజుల తరువాత కనిపించాడు సుబ్బా.



''డబ్బేమైంది?'' అని అడిగాను.

''కొత్త ఉద్యోగం కోసం తిరగడానికి ఖర్చయింది. ఇప్పుడు నేనో సినిమాకి ప్రొడక్షన్ మేనేజర్ని'' అన్నాడు.

''ఇప్పుడీ కొత్త అవతారమెందుకు?''

''ప్రొడక్షన్ చూసుకోవడం చేతయితేనే ప్రొడ్యూసర్‌గా ఎదిగేది. గుర్తులేదా నా మొదటి ప్రతిజ్ఞ-ధర్తీ మాకీ కసమ్'' అని రికార్డ్ తిరగేసాడు.

నేను జడుసుకుని నోరు మూసుకున్నాను.

సుబ్బా ఎక్కడైనా షైన్ అవుతాడని నాకు తెలుసు. ఒకరోజు నన్ను కూడా షూటింగ్‌కి తీసుకెళ్ళాడు. అక్కడ డాక్టర్ వేషం వేసే నటుడు రాకపోయేసరికి ఆ వేషం నన్ను వేయమన్నారు.

''నేను ప్రొఫెసర్‌ని, డాక్టర్‌ని కాదు'' అన్నాను.

డైరెక్టర్ కాసేపు తల గోక్కొని రైటర్‌ని పిలిచి ''కథవెంటనే మార్చు. ఈ సీన్‌లో డాక్టర్‌కి బదులు ప్రొఫెసర్ వుండాలి'' అని చెప్పాడు.

''ఓస్ అదెంత పని'' అంటూ రైటర్ ఎగిరి గంతేసి సీన్లన్ని పానకంలా తిరగగొట్టాడు.

నేను మేకప్ వేసుకుంటూ వుండగా డైరెక్టర్ కోపంగా సుబ్బాని పిలిచి ''ఏమయ్యా! ఈరోజు

షూటింగ్‌కి పిల్లి అవసరమని చెప్పానా లేదా?'' అని అరిచాడు.

''చెప్పారండి, కాని పిల్లి ఎక్కడ దొరుకుతుంది?'' అని నసిగాడు సుబ్బూ.

''ప్రొడక్షన్ మేనేజర్ని నువ్వా నేనా? వెళ్ళు, మళ్ళీ పిల్లితోనే కనబడు, అప్పటివరకూ నో షూటింగ్'' అన్నాడు.

సుబ్బూ హడావుడిగా వెళ్ళి ఎవరింట్లోనో పొయ్యిలో పడుకున్న పిల్లిని కాళ్ళూ చేతులతో కట్టేసి తెచ్చాడు. అది అందరి వైపూ పులిలా చూస్తూ గుర్రుమంటూ వుంది.

డైరెక్టర్ వుత్సాహంగా షూటింగ్ స్టార్ట్ చేశాడు. కట్లు విప్పగానే పిల్లి మెరుపుదాడి చేసింది. హీరోయిన్ మొహం రక్కేసింది. ఆ పిల్ల కుయ్యోమొర్రోమంటూ వుండగా అప్పటికప్పుడు రైటర్ కథని మార్చిపడేసాడు. హీరోయిన్ ఏడుపు సీన్లన్నీ కథలో కలిపాడు. షూటింగ్ జరిగిపోయింది కాని, మమ్మల్ని మెడపట్టుకు తోసారు. మేకప్‌తో వున్న నన్ను చూసి కుక్కలెంటపడ్డాయి. దాంతోసుబ్బూకి ఇంకో ఐడియా వచ్చింది.

వెంటనే ఒక జాతి కుక్కను పాతిక వేలకు కొనడానికి రంగం సిద్ధం చేసాడు. నా పేరుతో బ్యాంకులో అప్పుతీసుకుని ఎద్దుమాదిరుండే కుక్కను తెచ్చాడు. దానికి ప్రతాప్ అని పేరుపెట్టాడు.

పిల్లివల్ల పోయిన సినిమా ఉద్యోగాన్ని కుక్కతో సాధిస్తానని మూడో ప్రతిజ్ఞ చేసాడు. సినిమా షూటింగ్‌లకు కుక్కని అద్దెకిస్తానని చెప్పాడు. పేరుకి కుక్కేకాని ప్రతాప్ చాలా క్రమశిక్షణ, సమయపాలన వున్న కుక్క. టైంకి కరెక్ట్‌గా దానికి భోజనం పెట్టాలి. లేదంటే మమ్మల్ని తింటుంది. సుబ్బూ ఒకసారి నిర్లక్ష్యంగా వుంటంతో అతని కాలిపిక్కను సగం తినేసింది. తెలివిగా మిగతా సగాన్ని కాపాడుకున్నాడు. ప్రతి పూటా నాలుగైదు మాంసపు తునకలు లేకపోతే దానికి ముద్దదిగేది కాదు. దీని తిండికి ఇంకో పదివేలు అప్పు చెయ్యాల్సి వచ్చింది.

ఈ వ్యవహారమంతా సుబ్బూ ఇంటివద్దే జరగడంతో మా ఆవిడకి ఏమీ తెలియకుండా పోయింది.

ప్రతాప్‌ని తీసుకుని సుబ్బూ సినిమా కంపెనీల చుట్టూ తిరగసాగాడు.

ప్రతాప్ కోరల్ని చూసి అందరూ జడుసుకుని లైట్లు ఆర్పి, కెమెరా ఆఫ్ చేసి పేకప్ చెప్పేవాళ్ళు.

రైటర్‌ని ఎలాగో మచ్చిక చేసుకుని, మందు తాగించి, కుక్కని ప్రధాన క్యారెక్టర్‌గా పెట్టి సీన్స్ రాయమని అడిగాడు. గతంలో పిల్లి అనుభవాన్ని గుర్తుకు చేసుకున్న రైటర్ 'మనుషులే రకరకాల జంతువుల్లా బతుకున్న కాలమిది, ఇప్పుడుజంతువుల సినిమాలు వర్కవుట్ కావ'ని ఉపదేశించాడు.

ప్రతాప్ రానానూ తన తిండికోటా పెంచింది. తోకతో జోరీగల్ని తోలుకోవడం కూడా మానేసింది. అది కూడా సుబ్బూనే చేయాలి. లేదంటే కోరల్ని చూపిస్తుంది. కాలి పిక్కల్ని కాపాడుకోవడం అన్నిటికంటే పరమధర్మం కాబట్టి సుబ్బూ ఒక విసనకర్రతో జోరీగల్ని విసిరేవాడు. సుబ్బూని, ప్రతాప్‌ని ఇద్దరిని కూచోబెట్టి మేపడం వల్ల నాకు అప్పులు పెరిగిపోయాయి. ఇదే ఆలోచనలతో వున్న నేను ఒకరోజు క్లాస్‌లో కుక్కగురించి పాఠం చెబితే 'డాగ్స్ పార్టిసిపేషన్ ఇన్ బిజినెస్' అనే అంశంపై ఎంఫిల్ చేస్తానని ఒక స్టూడెంట్ తగులుకున్నాడు.

ఒకరోజు ఏమైందో తెలియదు కానీ రాత్రికి రాత్రి ప్రతాప్‌ని మా గేట్‌ముందు వదిలేసి సుబ్బూ ఎటో వెళ్ళిపోయాడు. వూరకపోరు మహాత్ములు. ప్రతాప్‌ని చూసి మా ఆవిడ దుడ్డుకర్ర తీసుకుని వచ్చింది. ప్రతాప్ గుర్రుమనే సరికి గజగజా వణికిపోయింది. నాకు చాలా ముచ్చటేసింది. మనవల్ల కాని పనిని ఒక కుక్క సాధించింది. దానికో చికెన్ బర్గర్ కొనిపెట్టాను.

రోజులు గడుస్తున్నాయి. సుబ్బూ జాడలేదు. ప్రతాప్ రోజురోజుకి బలిసిపోతూ వుంది. సుబ్బూ కోసం చేసిన అప్పులు అండపిండ బ్రహ్మాండమై కూర్చున్నాయి.

ఒకరోజు మా వీధిలోని జనమంతా పొలోమని పరుగులు తీస్తున్నారు. ఎక్కడో రాత్రికి రాత్రి వినాయకుడు వెలిసాడట. మా ఆవిడ నన్ను లాక్కెళ్ళింది.

ఒక రాతి వినాయక విగ్రహం ముందు గడ్డాలు మీసాలు బాగా పెరిగిన సాములోరు కూచుని వున్నారు. విగ్రహానికి తలబాదుకుంటూ ఆయన దుఃఖిస్తున్నాడు.

''స్వామీ! ఈ పేద వాడింట ఎందుకు వెలిసావు తండ్రీ. ఏం పెట్టిన్నిను సాకేది. ఏ జూబ్లిహిల్స్‌లోనో వెలిస్తే నీకు బంగారం తొడుగు వేయించేవాళ్ళు. కొబ్బరికాయలకు లేనివాన్ని, అరటిపండు అందివ్వలేని వాన్ని నాకెందుకయ్యా ఈశిక్ష'' అంటున్నాడు.

పక్కనున్న భక్తులు ''వూరుకోండి స్వామీ! మేము లేమా'' అని వూరడిస్తున్నారు.

సాములోరి గొంతువిని ఆశ్చర్యపోయాను. జుల పాల్లోంచి బయటపడిన పెద్ద చెవులు చూసి 'సుబ్బూ' అని కేకపెట్టాను. సుబ్బూ నావైపు చూడలేదు.

విగ్రహానికి తల బద్దలు కొట్టుకుని చస్తానని గింజుకుంటున్నాడు. వినాయకస్వామికి ఏ లోపమూ లేకుండా తాము చూస్తామని భక్తులు హామీ ఇస్తున్నారు. ఇన్‌స్టాంట్‌గా హుండీ కూడా వెలిసింది.

భోజనం టైం కావడం వల్ల ప్రతాప్ మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చింది. దాన్ని చూడగానే సుబ్బూ తన పిక్కల్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ ''వినాయకున్ని వెతుక్కుంటూ భైరవస్వామి కూడా వచ్చాడు'' అని అక్కడున్న ఫలహారాన్ని దానికి పెట్టాడు.

* * *

వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులు సుబ్బూని కాలుకిందికి పెట్టనివ్వడం లేదు. ఎక్కే కారు, దిగేకారు. ప్రతాప్ కూడా భైరవస్వామిగా పేరు తెచ్చుకున్నాడు. దాని ముందు కూడా హుండీ పెట్టారు. లేస్తే ఆకలి, తింటే నిద్ర అన్నంత వైభవంగా నడుస్తోంది దాని దశ. సుబ్బూ తన ప్రతిజ్ఞలన్నీ తీర్చుకుంటున్నాడు. రేపో మాపో గౌరవ డాక్టరేట్ కూడా లభించబోతోంది. పెద్ద చెవుల వాళ్ళకి పెద్ద తెలివని వూరికే అన్నారా! రాయిని పట్టుకుంటే బంగారంగా ఎలా మారుతుందో వినాయక విగ్రహంతో సుబ్బూ నిరూపించాడు.

